## క్లుప్తంగా

### నిత్యాన్నదానానికి రూ.21 వేల విరాళం


దాత కుటుంబానికి స్వామి చిత్రపటం అందిస్తున్న ఆలయ ఉద్యోగులు

**మామిడికుదురు:** అప్పనపల్లి బాల బాలాజీ స్వామి వారి సన్నిధిలో అమలు చేస్తున్న నిత్యాన్నదానం ట్రస్టుకు మంగళవారం అల్లవరం మండలం తాడికోనకు చెందిన ఉంగరాల దుర్గారావు, రత్నకుమారి దంపతులు తమ కుమారుడు వీరమనోజ్ పేరిట రూ.21,004 విరాళంగా అందించారు. ఈ విరాళాన్ని ఆలయ ఉద్యోగులకు అందించారని ఆలయ ఈఓ గ్రంధి మాధవి తెలిపారు. విరాళం అందించిన దాత కుటుంబ సభ్యులకు అర్చకులు ప్రత్యేక దర్శనం కల్పించి, స్వామి వారి ఆశీస్సులు అందించారు. దాత కుటుంబానికి స్వామి వారి చిత్రపటం, ప్రసాదాలను అందజేశారు.

### విజ్ఞాన శిబిరాలతో బహుళ ప్రయోజనం

**మామిడికుదురు:** వేసవి కాలంలో విద్యార్థులు ఖాళీగా ఉండకుండా గ్రంథాలయాలకు వచ్చి అక్కడ అందుబాటులో ఉన్న పుస్తకాలను చదవడం ద్వారా తమ విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని గ్రంథాలయ నిర్వాహకులు ఏకేవీఆర్ సూర్యనారాయణ సూచించారు. మామిడికుదురు శాఖా గ్రంథాలయంలో మంగళవారం జరిగిన సమావేశంలో ఆయన విద్యార్థులకు పలు సూచనలు అందించారు. విద్యార్థుల కోసం ఏటా వేసవిలో ప్రభుత్వం సమ్మర్ క్యాంప్ పేరిట విజ్ఞాన శిబిరాలు నిర్వహిస్తుందని చెప్పారు. వచ్చే నెల 7వ తేదీ వరకు ఈ శిబిరాలు కొనసాగుతాయన్నారు. విద్యార్థులు కథలు, కథనాలు, సృజనాత్మక కృత్యాలకు పదును పెట్టాలన్నారు. సమావేశంలో బీడీసీ యెరుబండి కన్న బాబు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

**పుస్తక పఠనంపై ఆసక్తి పెంచాలి**

**అంబాజీపేట:** పిల్లలకు పుస్తక పఠనంపై ఆసక్తి పెంచాల్సిన అవసరం ఉందని గ్రంథాలయ రికార్డు అసిస్టెంట్ జి.శ్రీనివాస్ అన్నారు. అంబాజీపేట గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిక్షణ శిబిరంలో మంగళవారం పిల్లలతో పుస్తక పఠనం చేయించారు. శిబిరంలో విద్యార్థులకు కథలు చెప్పడం, యోగా, గణితం సబ్జెక్టులో మెళకువలు నేర్పించారు. శ్రీనివాస్ మాట్లాడుతూ వచ్చే నెల 7వ తేదీ వరకూ ఈ శిబిరం కొనసాగుతుందని చెప్పారు. కార్యక్రమంలో గ్రంథాలయ రీడర్లు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

### ఘనంగా చింతాలమ్మ తీర్థం

**అంబాజీపేట:** మొసలపల్లిలో వేంచేసిన చింతాలమ్మ అమ్మవారి తీర్థాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం గ్రామ ఆడపడుచులు, మహిళలు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని చలివిడి పానకాలు, ముడుపులు, మొక్కులు చెల్లించుకున్నారు. సోమవారం రాత్రి గ్రామం నిర్వహించిన జాతరను అంగరంగ వైభవంగా జరిపించారు. జాతరలో ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు పలువురిని ఆకట్టుకున్నాయి.

### బాలిక అదృశ్యంపై విచారణ

**యానాం:** నియోజకవర్గ పరిధిలో గతేడాది డిసెంబర్‌లో అదృశ్యమైన బాలికకు సంబంధించి ఆచూకీ లభ్యం కాకపోవడంతో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఎస్పీ రాజశేఖరన్ తదితరుల ఆధ్వర్యంలో మంగళవారం విచారణ ప్రారంభించారు. ఈ సందర్భంగా కుటుంబసభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు బాలిక నివాసం ఉంటున్న యూకేవీనగర్‌కు ఎస్పీ రాజశేఖరన్, సీఐ షణ్ముగం, ఎస్‌ఐ మురుగానందం, శేరు నూకరాజు వెళ్లి వివరాలు అడిగి తెలుసుకున్నారు. గ్రామంలోనూ స్థానికులను కలిసి విచారించారు.

### కన్నుల పండువగా సదస్యం

**ఆత్రేయపురం:** పురాణ ప్రసిద్ధి చెందిన మండలంలోని ర్యాలి ఉమా కమండలేశ్వర స్వామి, జగన్మోహినీ కేశవస్వామి ఆలయంలో వేంచేసిన రమా సత్యనారాయ స్వామి, ఆలయల్లో మంగళవారం సదస్యం కార్యక్రమం కన్నులపండువగా నిర్వహించారు. ఆలయాల వద్ద ఉదయం గ్రామోత్సవం జరిగింది. వేదపండితులు, అర్చకుల వేదపారాయణతో స్వామికి ఆశీర్వచనం కార్యక్రమం చేశారు. విష్వక్సేనపూజ, నీరాజన మంత్ర పుష్పం, బాలభోగం, వేదపారాయణ, నివేదన, సుప్రభాతసేవ, బలిహరణ, దివ్య ప్రబంధనం కార్యక్రమాలను వేదపండితులు వేద మంత్రాల పఠనంతో నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామిని దర్శించుకోవడంతో పాటు మొక్కులు చెల్లించారు. స్వామికి మిరమిట్లు గొలిపే బాణసంచా కాల్పుల నడుమ అంగరంగ వైభవంగా గ్రా మోత్సవం నిర్వహించారు. అనంతరం పవళింపు సేవ నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని తిలకించేందుకు వివిధ ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. ఆలయ ఈఓ బి.కృష్ణ చైతన్య ఆధ్వర్యంలో ఆలయ సిబ్బంది ఏర్పాట్లను పర్యవేక్షించారు.

# ఆధునీకరణపై నీలినీడలు

- అప్పనపల్లి కాజ్‌వేకు పొంచి ఉన్న ముప్పు
- అధ్వాన స్థితిలో రోడ్డు


శిథిలమై దిగబడిపోతున్న అప్పనపల్లి కాజ్‌వే

**మామిడికుదురు:** మూడు లంక గ్రామాలకు ప్రధాన మార్గమైన అప్పనపల్లి కాజ్‌వే ఆధునీకరణపై నీలి నీడలు కమ్ముకున్నాయి. నిధులు మంజూరయ్యాయని, సుదీర్ఘ కాలం నాటి కాజ్‌వే స్థానే పక్కా కాజ్‌వే పునర్నిర్మాణానికి నోచుకుంటుందని ఆశించిన ప్రజలకు చివరకు నిరాశే మిగిలింది. ఈ వేసవిలో పనులు పూర్తి చేస్తారని ప్రజలు ఆశించినా ఆ దిశగా ఒక్క అడుగు కూడా ముందుకు పడలేదు. వేసవి సీజన్ దాదాపు ముగింపు దశకు చేరిన తరుణంలో ఈ కాజ్‌వే ఆధునీకరణ అటకెక్కినట్లేనని చెబుతున్నారు. శిథిలస్థితికి చేరిన కాజ్‌వేను సమూలంగా తొలగించి దాని స్థానే కొత్త కాజ్‌వే నిర్మించేందుకు గత ఏడాది రూ.4 కోట్లు నిధులు మంజూరు చేశారు. కానీ నిధుల విడుదలలో జాప్యం వల్ల కాజ్‌వే పనులు ప్రారంభం కాలేదు. ప్రస్తుతం ఉన్న కాజ్‌వే పూర్తిగా పాడైపోయి శిథిలస్థితికి చేరింది. ఈ కాజ్‌వే ఎక్కడికక్కడ దిగబడిపోయి ప్రమాదకరంగా మారింది. ఒక మాదిరి వరదకే ఈ కాజ్‌వే ముంపు బారిన పడుతోంది. దశాబ్దాల కాలం నుంచి ఈ కాజ్‌వే ఎత్తు పెంచి దీన్ని ఫ్లై ఓవర్ తరహాలో అభివృద్ధి చేయాలని లంక గ్రామాల ప్రజలు డిమాండ్ చేస్తున్నా సమస్య మాత్రం పరిష్కారం కావడం లేదు.

**సీసీ రోడ్డు నిర్మించి.. కాజ్‌వే విస్మరించారు**

గోదావరి వరదలను దృష్టిలో ఉంచుకుని ప్రస్తుతం ఉన్న రోడ్డును 12 అంగుళాలు ఎత్తు పెంచి పక్కా సీసీ రోడ్డు నిర్మించారు. పాశర్లపూడి నుంచి అప్పనపల్లి వరకు రూ.12 కోట్లతో సిమెంట్ రోడ్డు నిర్మించారు. ఇంత వరకు బాగానే ఉంది. కానీ సీసీ రోడ్డు మధ్యలో కాజ్‌వే పనులు నిలిచిపోయాయి. దీంతో సీసీ రోడ్డు నిర్మించిన ఫలితం లేకుండా పోయిందని మూడు గ్రామాల ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీంతో పాటు బి.దొడ్డవరం నుంచి పెదపట్నంలంక వరకు సుమారు అయిదు కిలో మీటర్ల మేర ఆర్‌అండ్‌బీ రోడ్డు పూర్తిగా పాడైపోయింది. ఎక్కడికక్కడ గోతులు ఏర్పడి ఆ రెండు గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీన్ని కూడా అభివృద్ధి చేయాల్సి ఉంది. కాజ్‌వే నిర్మాణంతో పాటు ఆర్‌అండ్‌బీ రోడ్డు అభివృద్ధిపై అధికారులు దృష్టి సారించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. దీనిపై ఆర్‌అండ్‌బీ ఏఈ సురేష్‌ను వివరణ కోరగా ఇంత వరకు జరిగిన పనులకు బిల్లు పెండింగ్‌లో ఉందన్నారు. అది క్లియర్ కాగానే కాజ్‌వే పనులు మొదలు పెడతామని చెప్పారు.

### కాజ్‌వేను అభివృద్ధి చేయాలి



పాశర్లపూడి ఏటిగట్టు దిగువన కాజ్‌వే పూర్తిగా దెబ్బతింది. దానిపై ప్రయాణం ప్రమాదకరంగా మారింది. గోదావరి వరదల సమయంలో ఇక్కడ పరిస్థితి చాలా ప్రమాదకరం. వరద ప్రవాహం ఎక్కువగా ఉండడం వల్ల గతంలో ఇక్కడ పలువురు మృత్యువాత పడ్డారు. ఈ కాజ్‌వేను తొలగించి దాని స్థానే ముంపుబారిన పడకుండా కొత్త కాజ్‌వే నిర్మించాలి. దీనిపై అధికారులు దృష్టి సారించాలి.

– ఆకుల చిన ఆదినారాయణ, బి.దొడ్డవరం

### కాజ్‌వేను త్వరగా నిర్మించండి



పాశర్లపూడి కొండాలమ్మ చింత సెంటర్ నుంచి పక్కాగా సిమెంట్ కాంక్రీట్ రోడ్డు నిర్మించారు. చాలా సంతోషం. కానీ మధ్యలో కాజ్‌వేను వదిలేయడం చాలా ఇబ్బందిగా ఉంది. దాన్ని కూడా పూర్తి చేస్తే లంక గ్రామాల ప్రజలకు ఎంతో మేలు జరుగుతుంది. లేని పక్షంలో సీసీ రోడ్డు నిర్మించిన ప్రయోజనం ఉండదు. దీనిపై అధికారులు దృష్టి సారించి కాజ్‌వేను త్వరగా పూర్తి చేసే దిశగా కార్యాచరణ చేపట్టాలి.

– ఉప్పే సాయికుమార్, అప్పనపల్లి

### పెదపట్నంలంక రోడ్డును అభివృద్ధి చేయాలి



బి.దొడ్డవరం నుంచి పెదపట్నంలంక వెళ్లే రోడ్డు చాలా అధ్వానంగా ఉంది. ఈ రోడ్డుపై ప్రయాణం నరకప్రాయంగా మారింది. గోతులు పడి, మెటల్ లేచిపోయి రోడ్డు పాడైపోవడంతో వాహనదారులు నిత్యం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ రోడ్డుకు మరమ్మతులు నిర్వహించడం తప్ప దీన్ని పూర్తి స్థాయిలో అభివృద్ధి చేయడం లేదు. ఇప్పటికైనా స్పందించి ఈ రోడ్డును బాగు చేయాలి.

– కొమ్ముల గోపి, పెదపట్నంలంక

## పలువురికి ఆర్థిక సాయం


సత్యనారాయణకు ఆర్థిక సాయం అందిస్తున్న తెన్నేటి ఫిలిప్ తదితరులు

**మలికిపురం:** తన పుట్టినరోజు సందర్భంగా గల్ఫ్ గృహ కార్మికుల హెల్పింగ్ హేండ్స్ ఫౌండేషన్ కువైట్ గ్రూప్ వ్యవస్థాపకుడు, కోర్ కమిటీసభ్యులు తెన్నేటి ఫిలిప్ పుట్టినరోజు సందర్భంగా పలువురు పేదలకు రూ.41 వేలను మంగళవారం ఆర్థిక సాయంగా అందించారు. మలికిపురం మండలం లక్కవరం వాసి బత్తుల సత్యనారాయణకు ప్రమాదం జరగగా కాలికి ఆపరేషన్ చేయించుకుని ఆర్థిక ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో రూ.పది వేలు అందించారు. ఇలా పలు గ్రామాల పేదలకు కూడా రూ.5 వేల చొప్పున సాయం అందించారు. పేదలకు సాయం చేయాలనే ఆలోచనతో అనేక సేవ కార్యక్రమాలు చేస్తున్నట్లు ఆయన వివరించారు. తెన్నేటి ఫిలిప్ సేవలను అభినందించారు. కార్యక్రమంలో రాజోలు నియోజకవర్గ దండోరా నాయకులు మరియు సమత సంఘ మిత్ర సొసైటీ అధ్యక్షుడు నగేష్ తెన్నేటి, ఉల్లంపర్తి దర్శనం, ముస్కూడి జగదీష్, మంద రవికుమార్, భాస్కరరావు ఎం.బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

### శాంతిభద్రతలకు సహకరించండి

**మామిడికుదురు:** ప్రతి ఒక్కరూ ప్రశాంతంగా ఉండి, శాంతిభద్రతల పరిరక్షణకు సహకరించాలని పి.గన్నవరం సీఐ ప్రశాంత్‌కుమార్ సూచించారు. పెదపట్నంలంక, అప్పనపల్లి గ్రామాల్లో మంగళవారం గ్రామ పెద్దలు, యువతతో నిర్వహించిన ముందస్తు సమావేశాల్లో సీఐ మాట్లాడారు. పోలింగ్ ప్రశాంతంగా ముగిసిందని, కౌంటింగ్ తరువాత కూడా వివాదాలకు దూరంగా ఉండాలని సీఐ సూచించారు. ఎన్నికల సమయంలో కేసుల్లో ఇరుక్కుంటే భవిష్యత్‌లో ఇబ్బందులు పడతారన్నారు.

### గోగన్నమఠంలో అగ్ని ప్రమాదం

**మామిడికుదురు:** గోగన్నమఠం గ్రామంలోని ప్రధాన రహదారి పక్కన రెండెకరాల విస్తీర్ణంలో ఉన్నత చెత్త అంటుకుని మంగళవారం భారీగా మంటలు లేచాయి. ఆ స్థలం చుట్టూ ఫెన్సింగ్ వేసి గేట్లు ఉండడం వల్ల స్థలం లోపలి భాగంలో ఏం జరిగిందన్న విషయం తెలియక స్థానికులు ఆందోళన చెందారు. రాజోలు అగ్నిమాపక కేంద్రానికి సమాచారం ఇవ్వడంతో వారు సంఘటన స్థలానికి చేరుకుని మంటల్ని అదుపు చేశారు. ఖాళీ ప్రదేశంలో కొబ్బరి చెత్తతో పాటు పశుగ్రాసం కాలిపోయాయని, పెద్దగా ఆస్తి నష్టం ఏమీ జరగలేదని రాజోలు అగ్నిమాపక కేంద్రం ఉద్యోగులు తెలిపారు.

### నేడు ఇటికాలమ్మ జాతర

**అంబాజీపేట:** మాచవరంలో వేంచేసిన ఇటికాలమ్మ అమ్మవారి జాతరను బుధవారం రాత్రి ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. జాతరలో సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేసినట్లు ఉత్సవ కమిటీ అధ్యక్ష కార్యదర్శులు మైపాల నాగబాబు, బందారు కొండలు తెలిపారు. గురువారం ఆలయ ప్రాంగణం వద్ద తీర్థంనిర్వహిస్తారన్నారు.

### నేదునూరులో ముత్యాలమ్మ తీర్థం

**అయినవిల్లి:** మండలంలోని నేదునూరులో కొలువైన ముత్యాలమ్మ తీర్థ మహోత్సవాలు మంగళవారం అత్యంత వైభవంగా జరిపారు. అమ్మవారిని అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకుని కానుకలు, మొక్కులు చెల్లించారు. అమ్మవారికి గ్రామోత్సవం జరిపారు. అలాగే అయినవిల్లిలో కొలువైన సత్తెమ్మ తల్లికి సోమవారం రాత్రి జాతర చేసి, మంగళవారం తీర్థం జరిపారు. భక్తులు అధిక సంఖ్యలో అమ్మవారిని దర్శించారు. మొక్కులు సమర్పించారు.

### విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదగాలి

**మామిడికుదురు:** ప్రభుత్వ కళాశాలల్లో చదువుకుని విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదగాలని డీఆర్డీఏ అసిస్టెంట్ ప్రాజెక్టు మేనేజర్ అజయ్ సూచించారు. మామిడికుదురు డీఆర్డీఏ కేంద్రంలో మంగళవారం సీసీఈ ఆదేశాల మేరకు రాజోలు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆధ్వర్యంలో ప్రిన్సిపాల్ సాయిబాబు అధ్యక్షతన అడ్మిషన్ అవేర్‌నెస్ ప్రోగ్రామ్ జరిగింది. ప్రిన్సిపాల్ సాయిబాబు మాట్లాడుతూ రాజోలు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఉన్నత విలువలతో కూడిన నాణ్యమైన విద్య అందిస్తున్నామన్నారు. తమ కళాశాలలో చదువుకునే విద్యార్థులకు ప్రభుత్వ పథకాలు అందిస్తున్నామని చెప్పారు. సమావేశంలో వైస్ ప్రిన్సిపాల్ పద్మనాభం, నల్లి రాజు, డాక్టర్ తోపే, బాలు, నాగరాజు, అనిల్, ప్రతాప్‌రాజు పాల్గొన్నారు.

## ఆర్బీకేల్లో వరి విత్తనాలు అందుబాటులో ఉంచాలి


అంబాజీపేటలో మాట్లాడుతున్న ఏడీఏ రామమోహనరావు

**అంబాజీపేట:** ఖరీఫ్ పంటకు సంబంధించి రైతులకు అవసరమైన వరి విత్తనాలను ఆయా గ్రామాల్లో ఉన్న ఆర్బీకేల్లో అందుబాటులో ఉండేలా తగు చర్యలు తీసుకోవాలని పి.గన్నవరం ఏడీఏ ఎస్‌జేవీ రామమోహనరావు చెప్పారు. అంబాజీపేట మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో అంబాజీపేట, పి.గన్నవరం, మామిడికుదురు మండలాలకు చెందిన వీఏఏ, వీహెచ్‌ఏలకు సమావేశాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడీఏ మాట్లాడుతూ ఖరీఫ్ పంటలో స్వర్ణ, ఎంటీయూ 1064, 1318 వరి రకాలకు కిలోకు రూ.5 వంతున ప్రభుత్వం రాయితీని ఇస్తుందన్నారు. ఈ విషయాన్ని రైతులకు వివరించి వారికి అవసరమైన వరి విత్తనాలను ఆర్బీకేల వద్ద సిద్ధంగా ఉంచాలన్నారు. వరి విత్తనాలతో పాటు ఎరువులు స్టాక్ సిద్ధం చేసుకోవాలన్నారు. వరి విత్తనాల విషయంలో ఎవరూ అలసత్వం వహించవద్దన్నారు. అనంతరం పంట కోత ప్రయోగాలకు సంబంధించి కిట్లను వీఏఏ, వీహెచ్‌ఏలకు అందజేశారు. సమావేశంలో మండల వ్యవసాయాధికారులు సీహెచ్‌డీ విజయ్‌కుమార్, ఎ.కల్యాన్ సూర్యకుమార్, బి.మృదుల, ఏఈఓ డి.దుర్గారావు పాల్గొన్నారు.

## హత్యాయత్నం ఘటనపై విచారణ చేయాలి


ఆసుపత్రిలో బాధితుడిని పరామర్శిస్తున్న ముత్యాల శ్రీనివాసరావు

**మలికిపురం:** మండలంలోని గోగన్నమఠం గ్రామానికి చెందిన కోరుకొండ రాజ్‌కుమార్ కిడ్నాప్, హత్యాయత్నంపై సమగ్ర దర్యాప్తు చేసి, నిందితులందరిని అరెస్టు చేయాలని మానవ హక్కుల వేదిక ఉమ్మడి తూర్పు జిల్లా ప్రధాన కార్యదర్శి ముత్యాల శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. మంగళవారం రాజోలు ప్రభుత్వ హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న బాధితుడు రాజ్ కుమార్‌ను కలిసి విషయ సేకరణ చేసినట్లు ఆయన ఒక ప్రకటనలో తెలిపారు. మే 14న మధ్యాహ్నం 3 గంటలకు కొంత మంది వ్యక్తులు కిడ్నాప్ చేసి, నోటిలో గుడ్డలు కుక్కి కేశనపల్లి బీచ్‌కు తీసుకువెళ్లి విచక్షణారహితంగా సరుగుడు కర్రలతో కొట్టి చంపాలని ప్రయత్నం చేశారని శ్రీనివాస్ ఆరోపించారు. అంతేకాకుండా తన కుటుంబ సభ్యులకు ఫోన్ చేసి మీ అబ్బాయిని విడిచి పెట్టాలంటే రూ.50 వేలు ఇవ్వాలని, లేకుంటే చంపేస్తామని డిమాండ్ చేశారని, గత్యంతరం లేని పరిస్థితుల్లో కుటుంబ సభ్యులు భయపడి రూ.20 వేలు మలికిపురం గ్రామానికి చెందిన ఒక వ్యక్తి మొబైల్‌కు ఫోన్ పే చేసినట్టు బాధితుడు చెప్పాడని ఆయన వివరించారు. ఈ ఘటనలో పది మంది వరకు పాల్గొన్నారని అన్నారు. తీవ్ర గాయాలతో ఉన్న రాజకుమార్‌ను కుటుంబ సభ్యులు మే 15న రాజోలు ప్రభుత్వ ఆసుపత్రిలో జాయిన్ చేశారని చెప్పారు. ఈ కిడ్నాప్, హత్యాయత్నం కేసులో కొంతమంది నిందితులను తప్పించాలని ప్రయత్నాలు జరుగుతున్నాయని రాజ్‌కుమార్ ఆరోపిస్తున్నాడు. దీనిపై సమగ్ర విచారణ చేసి, నిందితులందరిని అరెస్టు చేయాలని మానవ హక్కుల వేదిక డిమాండ్ చేసింది.

## అక్రమ అడ్మిషన్లపై చర్యలు తీసుకోవాలి


ఆలమూరులో ప్రైవేట్, కార్పొరేట్ అక్రమాలపై ప్రసంగిస్తున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు

**ఆలమూరు:** ప్రతిష్టాత్మక విద్యాహక్కు చట్టాన్ని కొన్ని ప్రైవేట్, కార్పొరేట్ విద్యా సంస్థలు దుర్వినియోగం చేస్తున్నాయని ఏఐఎస్ఎఫ్ నాయకులు తీవ్రంగా విమర్శించారు. స్థానిక సమత కార్యాలయం వద్ద ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ప్రైవేటు పాఠశాలల అక్రమ దోపిడీ నియంత్రణపై మంగళవారం నిర్వహించిన సమావేశానికి ముఖ్య అతిథిగా ఏఐఎస్ఎఫ్ జిల్లా కో కన్వీనర్ వెంకట్ పాల్గొని ప్రసంగించారు. కార్పొరేట్, ప్రైవేటు స్కూళ్లలో అడ్మిషన్ల కోసం ఆయా పాఠశాలల యాజమాన్యాలు, ప్రతినిధులు విద్యార్థుల తల్లిదండ్రులకు మాయమాటలు చెప్పి ధనార్జనే ధ్యేయంగా అడ్మిషన్లను పొందుతున్నారన్నారు. ఈ క్రమంలో విద్య హక్కు చట్టాలను గాని, ప్రభుత్వ నియమ నిబంధనలను గానీ ఏమాత్రం పట్టించుకోకుండా తమ ప్రైవేట్ పాఠశాలల్లోనే మంచి విద్యా బోధన దొరుకుతుందని ఇంటింటికీ తిరుగుతూ అబద్ధ ప్రచారం చేస్తున్నారన్నారు. వేసవి సెలవుల అనంతరం నిర్వహించాల్సిన అడ్మిషన్లు ఇప్పుడే ప్రైవేట్ పాఠశాలలు నిర్వహిస్తున్నా విద్యాశాఖ అధికారులు పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికై నా విద్యాశాఖ అధికారులు కళ్లు తెరచి ప్రైవేట్ కార్పొరేట్ కళాశాలలపై తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఉద్యమాలతో ప్రైవేట్ పాఠశాలల వద్ద ప్రత్యక్ష ఆందోళనకు దిగుతామని హెచ్చరించారు. ప్రైవేట్ పాఠశాలలు, కార్పొరేట్ పాఠశాలల యజమాన్యాలు విద్యా హక్కు చట్టాన్ని ఉల్లంఘించి అధిక ఫీజులతో విద్యార్థులను, వారి తల్లిదండ్రులను దోపిడీ చేస్తున్నాయని, ఫీజుల నియంత్రణపై ప్రభుత్వం దష్టి సారించాలని ఏఐఎస్ఎఫ్ నాయకులు కోరారు. ఏఐఎస్ఎఫ్ జిల్లా నాయకులు సతీశ్, సాయిరామ్ ,కుమార్, నూకన్న ప్రసాద్, రమణ తదితరులు పాల్గొన్నారు.

## చంటిరాజు సేవలు అభినందనీయం


చంటిరాజును అభినందిస్తున్న వైఎస్సార్ సీపీ అభ్యర్థి గొల్లపల్లి సూర్యారావు

**మలికిపురం:** వైఎస్సార్ సీపీ నాయకుడు, ప్రముఖ పారిశ్రామికవేత్త కునాధరాజు రామకష్ణంరాజు (చంటిరాజు) సేవలు అభినినీయమని రాజోలు వైఎస్సార్ సీపీ అభ్యర్థి, మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు అన్నారు. ఆయన బర్త్ డే సందర్భంగా మంగళవారం ఆయన చంటిరాజును సన్మానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ చంటిరాజు లాంటి పెద్దలు అరుదుగా ఉంటారని అన్నారు. అలాగే మలికిపురం రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో చంటిరాజు పుట్టినరోజు వేడుకలను నిర్వహించారు. కేక్ కటింగ్ చేసి శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో ప్రముఖ పారిశ్రామికవేత్త కేఎస్ఎన్ రాజు, జంపన బుజ్జిరాజు, రాజు, రోటరీ అసిస్టెంట్ గవర్నర్ నల్లి శివకుమార్, క్లబ్ ప్రెసిడెంట్ సోమిశెట్టి మురళీకృష్ణ, కార్యదర్శి బందీల సంపత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ఖరీఫ్‌కు రైతులను సన్నద్ధం చేయాలి


పంటకోత ప్రయోగ కిట్లు అందిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి బోసుబాబు

**రాజోలు:** రానున్న ఖరీఫ్ సాగుకు రైతులను సన్నద్ధం చేయాలని జిల్లా వ్యవసాయాధికారి వి.బోసుబాబు సూచించారు. మంగళవారం సోంపల్లి గ్రామ ఆర్బీకే వద్ద రాజోలు వ్యవసాయ సబ్ డివిజన్ పరిధిలోని వ్యవసాయాధికారులతో సమీక్ష నిర్వహించారు. 2024 ఏడాదికి సంబంధించి ఖరీఫ్ సాగు ముందస్తు కార్యాచరణపై అవగాహన సదస్సు జరిగింది. ఖరీఫ్ సాగును రైతులు ఉత్సాహంగా చేపట్టేందుకు వ్యవసాయశాఖ పూర్తి స్థాయిలో సహకారాన్ని అందించాలన్నారు. ఆర్బీకేల్లో సబ్సిడీ విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉంచుకోవాలన్నారు. రాజోలు నియోజకవర్గ పరిధిలోని వ్యవసాయ సిబ్బందికి పంటకోత ప్రయోగాలకు సంబంధించిన కిట్లను బోసుబాబు పంపిణీ చేశారు. డీఆర్‌సీ ఏడీఏ రాజశేఖర్, ఏడీఏ రామ్మోహనరావు తదితరులు పాల్గొన్నారు.

## ఆర్ల అక్కమ్మకు గండ దీపాల సమర్పణ


ఆర్ల అక్కమ్మకు గండ దీపాలు సమర్పిస్తున్న భక్తులు

**అయినవిల్లి:** మండలంలోని కొండుకుదురులో కొలువైన ఆర్ల అక్కమ్మవారికి మంగళవారం ఘనంగా తీర్థ మహోత్సవాలు జరిపారు. ఈ సందర్భంగా అమ్మవారి ఆలయాన్ని విద్యుత్ దీపాలతో కనుల విందుగా అలంకరించారు. అమ్మవారిని జిల్లా వ్యాప్తంగా వేలాది భక్తులు తరలివచ్చి దర్శించుకున్నారు. అమ్మవారికి గండ దీపాలు, దండుగమ్మ కావళ్లు, కానుకలు, మొక్కులు చెల్లించారు. కోరిన కోర్కెలు తీర్చే అమ్మవారిగా ఆర్ల అక్కమ్మవారు ప్రసిద్ధికెక్కారు. ఆలయ కమిటీ సభ్యులు అమ్మవారి దర్శనం కోసం వచ్చిన భక్తులకు కానుకలు, మొక్కులు చెల్లించారు.

### రాజీవ్‌గాంధీ సేవలు చిరస్మరణీయం

**మామిడికుదురు:** మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ దేశానికి అందించిన సేవలు చిరస్మరణీయమైనవని పి.గన్నవరం ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు శ్లాఘించారు. రాజీవ్‌గాంధీ 33వ వర్ధంతి సందర్భంగా మంగళవారం నగరం గ్రామంలో రాజీవ్‌గాంధీ చిత్రపటానికి ఎమ్మెల్యే చిట్టిబాబుతో పాటు కాంగ్రెస్ పార్టీ నేతలు పూల మాలలు వేసి నివాళులర్పించారు. రాజీవ్‌గాంధీ సేవలను కొనియాడారు. దేశాన్ని శాస్త్ర, సాంకేతిక రంగాల్లో అభివృద్ధి పథంలో నడిపించిన మహనీయుడని కీర్తించారు. ఆయన అందించిన సేవలు అమూల్యమైనవన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు తప్పవు


నర్శిపూడిలో అవగాహన సదస్సులో ప్రసంగిస్తున్న ఎస్సై శ్రీను నాయక్


ఆత్రేయపురంలో ప్రజలకు అవగాహన కల్పిస్తున్న ఎస్సై శ్రీనివాస్

**ఆత్రేయపురం:** సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో జూన్ 4న ఓట్ల లెక్కింపు సందర్భంగా ఎవరైనా గ్రామాల్లో శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై ఎస్.శ్రీనివాస్ హెచ్చరించారు. మంగళవారం మండలంలోని ఆత్రేయపురం, ర్యాలి గ్రామాల్లో శాంతి భద్రతలపై ప్రజలకు అవగాహన కలిగించారు. ఎన్నికల కమిషన్ ఆదేశాలు మేరకు ఎన్నికల కోడ్ అమల్లో ఉందన్నారు. ఏ విధమైన అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందు జాగ్రత్త చర్యలుగా పోలీస్ శాఖ కట్టుదిట్టమైన భద్రత ఏర్పాటు చేసిందన్నారు. ఎవరైనా గుంపులుగా కౌంటింగ్ కేంద్రాలకు వెళ్లేందుకు, ర్యాలీలు, ఊరేగింపులు, సమావేశాలు నిర్వహించుకునేందుకు ఏ విధమైన అనుమతులు లేవన్నారు. కవ్వింపు చర్యలకు పాల్పడితే సహించే ప్రసక్తి లేదన్నారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై హెచ్చరించారు.

**చట్ట వ్యతిరేక కార్యకలాపాలు పాల్పడితే కఠిన చర్యలు**

**ఆలమూరు:** మండల పోలీసు స్టేషన్ పరిధిలోని ఎవరైనా చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఆలమూరు ఎస్సై ఎల్.శ్రీనునాయక్ హెచ్చరించారు. మండలంలోని వివిధ గ్రామాల్లో మంగళవారం అవగాహన సదస్సులు ఏర్పాటు చేసి ప్రజలకు ప్రత్యేక సమావేశాలు నిర్వహించి స్థానిక సమస్యలపై ఆరా తీశారు. ఎస్సై శ్రీనునాయక్ మాట్లాడుతూ సత్ప్రవర్తనతో మెలిగే వారందరికీ పోలీసుల సహకారం ఉంటుందన్నారు. సార్వత్రిక ఎన్నికల నియమావళి ప్రశాంతంగా పూర్తయినప్పటికీ ప్రజల దృష్టి లెక్కింపు కార్యక్రమంపై నెలకొందన్నారు. ప్రస్తుతం ఎన్నికల ఫలితాలపై అందరూ ఉత్కంఠంగా ఎదురు చూస్తున్నారన్నారు. అయితే ప్రజలు ఎవరికి వారు స్వేచ్ఛగా స్వచ్ఛందంగా తమ ఓటు హక్కును వినియోగించుకున్నారని, ప్రస్తుతం ఎన్నికల లెక్కింపులపై ఎన్ని వాదనలు వినిపించుకున్నా ప్రయోజనం లేదని, పొలిటికల్ ఫలితాల్లో హీట్ పెరిగిందని గెలిచేది తమ అభ్యర్థులేనని పలు రాజకీయ పార్టీల వారు అంటున్నారున్నారు.అలాగే ప్రముఖ వాట్సాప్, ఫేస్బుక్, ట్విట్టర్ వంటి సోషల్ మీడియాలలో కవింపు చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.